# మినీ కథ

## మసిపంగు


నడిమింటి నరసింగ రావు

వరా విశాఖపట్నంలో టూటౌన్ పోలీస్ స్టేషను పక్కనటి చిన్నపార్కు. కటకటల్లా ఎదిగిన చెట్లతో, చీకటిగుయ్యారంలా వుండే ఆ పార్కులో కూచుంటే పక్కనున్న జైల్లో వున్నట్టు ఫీలవుతారేమో తెలీదుగాని... అడపాదడపా పడే కొళాయిలో నీళ్ళు పట్టుకోవడానికొచ్చే ఆడవాళ్ళు తప్ప మరెవరూ అంత రెగ్యులర్‌గా అక్కడకిరారు. అయితే మా ఊరు కార్పొరేషన్ అధికారులు, రాజకీయనాయకులు... ఎంతైనా గొప్పవారు కద! అందుచేత సామాన్యులు కూడా చొరబడడానికి సాహసించని ఆ పార్కులోకి...నవభారత రాజ్యాంగ నిర్మాత, పీడిత, తాడిత,నిమ్న దళితవర్గాల అభివృద్ధికి అవిరామంగా కృషి చేసిన మహానుభావుడి విగ్రహాన్ని సరాసరి ఆ పార్కులోకి తీసుకొచ్చి, ఎత్తుగా నిలబెట్టి, నిలువెత్తు ముసుగుకప్పేరు. కరెంటు పోయినప్పుడో లేదా అకస్మాత్తుగా చూసినప్పుడో... జడుసుకునేలాగ, హార్ట్ఎటాక్‌వున్న వాళ్ళు హఠాత్తుగా చూస్తే 'హరీ' మనేలాగ ఆ ముసుగుచాలా కాలంబట్టి అలాగే వుంది.

ఇంతకీ ఎందుకా ముసుగు తియ్యరు? అంతటి మహానుభావుడి దర్శనభాగ్యానికి ఎందుకంత లేటు? ఇలాటి బేతాళ ప్రశ్నలకి సమాధానాలు సక్రమంగా చెప్పగలిగే విక్రమార్కులు ఇప్పుడులేరు కనక,'పార్టీ గొడవల్లోనో....ముఠా రాజకీయాల్లోనో.... లేక మంత్రిగారికో, మేయరుగారికో తీరిక లేకపోవడంవల్లనో లేదా ఆ ముసుగు తీసేస్తే తమ 'లొసుగు' లెక్కడ బయటపడతాయోననే భయంచేతనో... ఆ యన్నలాగ ముసుగులోనే వుంచేసారు కాబోలు...'అని సరిపెట్టుకోక తప్పలేదు.


ఒకరోజు, సాయంసంధ్యవేళ ఆ పార్కులో కూర్చున్నాను. అప్పటికే లోకాన్ని చీకటి తెరలు పల్చగా చుట్టేస్తున్నాయి. కరెంట్ లేకపోవడంవల్ల కనుచూపు మేరలో ఎక్కడా వెలుగులేదు. ఆ చీకట్లో కూర్చోవడం ఇష్టంలేకపోయినా 'పదిమందికి వెలుగు చూపించిన మహానుభావుడే చీకటి ముసుగులో మగ్గుతున్నప్పుడు' నేనెంత అనుకొని అలాగే కూర్చున్నాను. అంతలో 'ఎలాగైనా మెల్లగా ఆ ప్లాట్‌ఫారం ఎక్కి ఆ ముసుగుకాస్త తీసేస్తే?.... జీవితంలో ఓ మంచిపని చేసానన్న సంతృప్తిఅయినా మిగులుతుంది... అనిపించింది. అయినా ఇన్నాళ్ళయింది ఈ విగ్రహాన్ని ఇక్కడ నిలబెట్టి...ఇంత కాలంవరకూ వీళ్ళకి తీరికలేదూ! (అపుసులే దేశాన్ని దోచుకుతిండానికే వాళ్ళకి టైం చాలడంలేదు) లాభంలేదు... ఎలాగైనా ఆ ముసుగు తీసెయ్యాలి. ఆ విగ్రహాన్ని 'పదిమందికి ఆదర్శంగా' నిలచేలా వెలుగులోకి తేవాలి... నా ఆలోచనలు ఇలా సాగుతుండగా హఠాత్తుగా ఎవరిదో చెయ్యి నాభుజంమీద పడింది. 'నాగురించే ఆలోచిస్తున్నావా నాయనా' అని గంభీరంగా వినిపించింది. పక్కకి తిరిగిచూస్తే ఆ చీకట్లో నాకెవరూ కనిపించలేదు. కాని మాటలు మాత్రం వినిపిస్తున్నాయి.

"నా గురించి బాధపడుతున్నావా నాయనా! చాలా సంతోషం. గతంలో నేను చేసిన కొద్దిపాటి సమాజ సేవని మీరంతా గుర్తుంచుకొని... ఈపార్కులో ఇలా నిలబెట్టడం నిజంగా నా అదృష్టం. పూర్వులయెడ, పెద్దలయెడ, మీకున్న గౌరవానికి దేశంపట్ల మీకున్న భక్తి ప్రపత్తులకీ నిదర్శనం. అదలావుంచు. ప్రస్తుతం నన్నిలా ముసుగులో వుంచినందుకు నువ్వు బాధపడుతున్నావు కదూ! వద్దునాన్నా...అనవసరంగా బాధపడకు. బాధపడి ఈ ముసుగుతీసే ప్రయత్నంచేసి నన్నవనసరంగా బాధపెట్టకు. నువ్వు తీయకుండా వుండడమే కాదు వీలుంటే ఎప్పటికీ నన్ని ముసుగులోనే వుంచే ఏర్పాటుచెయ్యి.



# తీయకు....

ఎందుకంటే ఈముసుగు నెలాగైనాభరించ వచ్చుకాని ఎండలకి, వానలకి తట్టుకుంటూ పక్షులకి పబ్లిక్ లేవట్రీగా ఉపయోగ పడుతూ రంగూ రూపూ కోల్పోయో, లేదా ఎన్నికలొస్తే వివిధ పార్టీల జండాలు మోసే కొయ్యలాగో...ఉపయోగపడేకన్న ఇలా ముసుగులో వుండడమే మంచిదని పిస్తోంది. నామాటమీద నమ్మకం చాలక పోతే అదుగో కొంచెం అప్ ఎక్కి కిందకి దిగితే ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగావున్న 'మహాకవి గురజాడ'గారి నడుగు. పక్షుల రెట్టలతో. ప్రకృతి భీభత్సాలతో ఆయనెలా సతమత మవుతున్నారో. మరో మాట చెప్పనా నాన్నా.. మొన్న హైదరాబాదులో జాతీయనాయకుడు, దళిత జన బాంధవ్యుడు అయిన బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని పోలికలు లేకుండా రూపొందించి, మొక్కుబడిగా ప్రతిష్ఠిస్తే, నగరప్రజలూ, నాయకులూ పోరుపెడితే ఆయన్ని తడికలమధ్య బందీనిచేసి చివరికి తొలగించేసారట. ఇది నాయనా మననాయకులకి పెద్దలమీదున్న అభిమానం. శిలా విగ్రహాన్ని చేయించి, దానితోపాటు ఫలకంమీద పేర్లు రాయించేసుకొని, ప్రతిష్ఠించి, పేపర్లోబొమ్మలుకట్టి మరీవేయించుకున్నప్పటి ఉత్సాహం....ఆతరువాత మన పాలకులకి వుండదు నాయనా! ఎందుకంటే మనది ప్రజాస్వామ్యం కదా! అంచేత వాళ్ళెప్పుడు ప్రజల సమస్యలతో సతమత మవుతూ వుంటారు. బతికున్న ప్రజల గురించి ఆలోచించే ఓపిక,-కోరిక, తీరిక లేని వాళ్ళని 'ఎప్పుడో ఏదోచేసిన'మమ్మల్ని గుర్తుపెట్టుకోమని ఇబ్బంది పెట్టడం ఏం బాగుంటుంది చెప్పు. కాబట్టి నాయనా ఎలాగోలా నన్ని ముసుగులోనే వుంచే ప్రయత్నం చెయ్యమ్మా..." ఆ మాటలు పూర్తి కాకుండా మధ్యలో నేను అడ్డుపడి "అదికాదు సార్.... మీలాటి మహానుభావులు.... ఇలా ఈ ముసుగుల్లో..." అని అనబోతుండగా ఠక్కున కరెంటువచ్చింది. చుట్టూచూస్తే ఎవరూ కనిపించలేదు. జరిగిన దంతా మననం చేసుకుని 'నిజమే ముసుగు తీసేస్తే ఎన్ని ఇబ్బందులో'అనుకొని, ఆ ప్రయత్నాన్ని మానుకొని అప్రయత్నంగా పార్కులోంచి బయటపడ్డాను.





# మినీ కథ

## కొత్తపిట్ట

మోహన్, సుధీర్, దిలీప్, గోపీనాథ్ ఒకానొక కాలేజీ స్టూడెంట్లు. హాస్టల్లో వుంటే కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనాలని, వేరేగా గది అద్దెకు తీసుకొని వుంటున్నారు. జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

ఆరోజు ఆదివారం. 10 గంటల సమయం. నలుగురు పేకాడుకుంటూ కూర్చున్నారు. వీధితలుపులు తెరిచేవున్నాయి. బైట సన్నగా తుంపర జల్లులా కురుస్తోంది. వాళ్ళు పుండుంటి గ్లాసుల్లో వున్న మందుని గొంతులో పోసుకుంటున్నారు. అప్పుడు వచ్చాడు వీరప్పడు. పదహారేళ్ళ పిల్లాడు.

"బాబులూ నా కేదైనా పనిప్పించరా!" అన్నాడు గుమ్మంలోకొచ్చి.

"ఎవడ్రా వాడు?" అన్నాడు మోహన్.

"కనిపించడంలా నల్లని వాడు, సన్నని వాడు, గెడ్డముక్కుగాడు..." అన్నాడు సుధీర్.

"ఏమంటున్నాడురా?" అన్నాడు మోహన్.

"ఎనిపించడంలే పని ఇప్పించమని వచ్చినాడు" అంటూ నవ్వాడు దిలీప్.

"పనిలేదు గినిలేదు పొమ్మను" చెప్పాడు గోపీనాథ్ గ్లాసులో ద్రవాన్ని గొంతులో పోసుకుంటూ.

"పని లేకపోవడం ఏమిటి— మనరూం ఒకసారి చూడు ఈ చెత్తంతా ఎవడు తుడుస్తాడు- మనకు టీ కావాలంటే గంటగంటకీ ఎవడు తెచ్చిస్తాడు! మనకు మందు కావాలన్నా— కొత్త పిట్టలు కావాలన్నా—" సుధీర్ మోహన్ వేపు చూసాడు.

'ఎగ్జాట్లీ కరెక్ట్ గురూ' అన్నాడు సిగరెట్టు వెలిగించి.

"వాడేమన్నా చీటింగ్ గాడేమో సరిగ్గా తెలుసుకొని పెట్టండి." గోపీ అన్నాడు.

"అసలు వాడు ఈ పనులన్ని చెయ్యగలడా చూ_ పల్లెటూరిబైతులాగున్నాడు." దిలీప్ సందేహం.

"లేదు సార్ అలా కనిపిస్తానంతే మీరేటి సెపితే సిటికెలో ఆ పని సేసేసు కొస్తాను సార్" అన్నాడు వీరప్పడు.

"ఒరే నీ పేరేమిటిరా!" అడిగాడు మోహన్.

"నా పేరు వీరప్పడు సార్."

"ఒరే అప్పడూ ఇటునంటి మందు సీసాలు తేవడమే కాకుండా తాగడం కూడా తెలుసో లేదో ముందు చెప్పు!"

"తాగడం తెలీదండి. కాని మా నాయన 3 సారా సీసాలు తెమ్మంటే నేనే తెచ్చేస్తుంటాను సార్ మా వూళ్ళో."

"ఫర్వాలేదు మనోడు గట్టోడే" అన్నాడు సుధీర్.

"ఒరే కొత్త కొత్త పిట్టల్ని తేవడం అలవాటుందా?" అన్నాడు మోహన్.

"అలవాటేమిటి సార్ మావూరి పెద్దలకు ఎప్పుడు సరఫరా సేత్తూనేవుంటాను. ముసిముసిగా నవ్వి చెప్పాడు.

"అమ్మో నే నేమిటో అనుకున్నారా! మనల్ని మించిపోయేటట్టున్నాడు" సుధీర్ అన్నాడు.

మోహన్లో ఉత్సాహం వుప్పొంగింది. "ఒరే వీరప్పడూ నీకో పరీక్ష రేపు."

"ఏమిటి సార్ ఆ పరీక్ష? సెప్పండి సార్" అన్నాడు వీరప్పడు.

"మరేం లేదు వీరప్పడు. మా అందరికీ కొత్తపిట్టలంటే మహా తహతహ. నువ్వుగాని ఓ కొత్తపిట్టని రేపు రాత్రిలోగా తెచ్చితివో... తంతే బూర్లెగంపలో పడ్డట్టే నీ పని"

"అలాగే సార్. కాని వైజాగ్లో దొరకవు, అనకాపల్లినించి తెస్తాను."

మర్నాడురాత్రి 9 గంటలకి వీరప్పడు రూంకి వచ్చేటప్పటికి, మిత్రులందరూ సుష్టిగా భోంచేసి మందు పట్టిస్తున్నారు. వీరప్పడ్ని చూగానే ఎగిరిగంతులేసారు.

"ఏవీ పిట్టలు" అన్నాడు మోహన్.

"మూడుదఫాలొచ్చినా మీ రూంకి. తాళాలేసున్నాయని పోయినా. సూడండి కొత్త రకాల పిట్టలు. రేపు క్రైమా వండి పెట్టితినా మరి ఒదలరు." చేతి సంచిలో నుండి చచ్చి వున్న పాలపిట్టల్ని తీసి నేలపై పెట్టాడు వీరప్పడు.

—రమ (విశాఖపట్టణం)